క్లుప్తంగా

నేడు అంబలం పూజ



మునగపాకలో అయ్యప్పస్వామి ఆలయం

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం భారీ ఎత్తున అంబలం పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏటా కార్తీక మాసంలో ఇక్కడ వేలాది మంది భక్తుల నడుమ అంబలం పూజ నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా ఆలయ ప్రాంగణంలో రాత్రి 7గంటల నుంచి అంబలం పూజ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి పనులపై ఫిర్యాదు

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురంలో ఉపాధిహామీ పథకం పనుల్లో జరిగిన అవకతకలపై విచారణ చేపట్టాలని కోరుతూ శుక్రవారం కర్రి మురళీ మోహనరావు అనే వ్యక్తి ఆడిట్ బృంద సభ్యులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో జరిగిన పనులకు సంబంధించి వివిధ కంపెనీల్లో పనిచేసే వారి పేరిట నిధులను స్వాహా చేసినట్టు ఆరోపించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పనులపై తగు విచారణ చేపట్టి అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కె.వెంకటాపురంలో పారిశుధ్య డ్రైవ్



పూడిక తీస్తున్న కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో శుక్రవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, డ్రైనేజీల్లో పూడికలు తీశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగ ఇందిరా భవానీ మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. దోమల వ్యాప్తిని నిరోధించేలా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఇంటితో పాటు వీధులను శుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న తోటాడ సర్పంచ్ మంగవేణి

మునగపాక: ఉపాధిహామీ పథకం ద్వారా తోటాడ పంచాయతీ అభివృద్ధి చెందుతోందని సర్పంచ్ దొడ్డి మంగవేణి తెలిపారు. ఈ పథకం ద్వారా రహదారులు,డ్రైనేజీలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. తోటాడ సచివాలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. తోటాడ,గవర్ల అనకాపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి సూరిశెట్టి శ్రీలక్ష్మి,పెద్దలు దొడ్డి కోటేశ్వరరావు,చదరం భాస్కరరావు, దొడ్డి రమేష్, పాలమరశెట్టి మురళి తదితరులు పాల్గొన్నారు.

బహువార్షిక పశుగ్రాసాల సాగుకు ప్రోత్సాహం

కోటవురట్ల: ఉపాధి హామీ పథకం నిధులతో బహువార్షిక పశు గ్రాసాల సాగు కోసం పాడి రైతులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు ఏపీవో నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పశు సంవర్ధకశాఖ సమన్వయంతో పథకాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. ఈ పథకం ద్వారా పశు గ్రాస సాగుకు ఒక్కో రైతుకు కనిష్టంగా 0.10 సెంట్లు, గరిష్టంగా 0.50 సెంట్లు ఉన్నవారు అర్హులుగా పేర్కొన్నారు. 0.50 సెంట్లకు గాను రెండేళ్లకు లేబర్ చార్జీగా రూ.14,250, ఎరువులు, పశుగ్రాస కణుపుల కొనుగోలుకు రూ.11,788 చొప్పున నిధులు జమ అవుతాయని తెలిపారు. సొంత భూమి, వ్యవసాయ బోరు కలిగి ఉన్న రైతులు మాత్రమే ఇందుకు అర్హులుగా తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు తమకు దగ్గరలో ఉన్న వీఆర్పీ, రైతు సేవా కేంద్రంలోని పశు సహాయకుడుని సంప్రదించాలని సూచించారు.

పడకేసిన ప్రాథమిక వైద్యం.!

- పెనుగొల్లు, సర్వసిద్ధి పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అంతంత మాత్రం
- సిబ్బంది, వైద్యులు పరస్పర ఫిర్యాదులతో కాలక్షేపం



పీహెచ్‌సీలో రోగికి వైద్య సేవలు అందిస్తున్న ఏఎన్‌ఎం



పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఎస్.రాయవరం: మండలంలో ప్రాథమిక వైద్యం పడకేసింది. పీహెచ్‌సీల్లో సిబ్బంది, వైద్యుల అలసత్వం, పరస్పర ఫిర్యాదులతో విధులు నిర్వహిస్తూ రోగులకు వైద్య సేవలు అందించడం లేదు. మండలంలో పెనుగొల్లు పీహెచ్‌సీలో 43 వేలు మంది, సర్వసిద్ధి పీహెచ్‌సీలో 26 వేలు మందికి వైద్య సేవలు అందాల్సి ఉంది. ఈ రెండు పీహెచ్‌ల్లో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ కొద్ది రోజులు వైద్యులు, సిబ్బంది పరస్పరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. కొందరు ఉద్యోగులు సమయపాలన పాటించకుండా దుమ్మొకొడుతూ ఉన్నతాధికారులతో సన్నిహితంగా మెలుగుతూ కాలం గడిపేస్తున్న సందర్భాలు ఉన్నాయని రోగులు చెబుతున్నారు. తాజాగా పలు ఆరోపణలతో పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారిని సస్పెండ్ సైతం చేశారు. అయితే అది తప్పుడు ఫిర్యాదు అని సస్పెండ్ అయిన డాక్టర్ రామ్‌నాయక్ కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ పీహెచ్‌సీల్లో అక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల నాయకులు కూడా పీహెచ్‌సీ నిధులు గోల్‌మాల్ అవుతున్నాయని ఫిర్యాదు చేస్తున్నారు. సిబ్బంది పనితీరు అసలేం బాగా లేదని రేవుపోలవరం గ్రామానికి చెందిన యువకులు ఆర్‌టీఐ ద్వారా వివరాలు ఇవ్వాలని దరఖాస్తు కూడా చేశారు.

టార్గెట్లు రికార్డులకు పరిమితం

పీహెచ్‌సీల్లో నిర్దేశించిన టార్గెట్‌లు రికార్డులకు మాత్రమే పరిమితమవుతున్నాయి. గర్భిణులకు పరీక్షలు కూడా సక్రమంగా చేయడం లేదని జిల్లా వైద్యాధికారే స్వయంగా హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇక కొరత ఉన్న సిబ్బంది స్థానంలో డెప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. అలా వచ్చేవారు పూర్తి స్థాయిలో వైద్య సేవల అందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు పీహెచ్‌సీల్లో స్టాఫ్‌నర్సుల కొరత కారణంగా గ్రామాల్లో ఉన్న ఏఎన్‌ఎంలతో వైద్యం చేయిస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఈ పీహెచ్‌సీల్లో పూర్తి స్థాయిలో వైద్యం అందడం లేదని భావించిన రోగులు నక్కపల్లి, యలమంచిలి సీహెచ్‌సీలకు వెళ్తున్నారు. ప్రసవాలు అతి తక్కువ సంఖ్యలో జరుగుతున్నాయి. ఎక్కువ శాతం నక్కపల్లి, యలమంచిలి, అనకాపల్లి ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

క్షీణించిన పారిశుధ్యం



తిమ్మాపురం రోడ్డుపై నిలిచిన మురుగునీరు

గ్రామాల్లో పారిశుధ్యం కూడా క్షీణించింది. పీహెచ్‌సీల తరఫున గ్రామాల్లో పర్యటించే వైద్య సిబ్బంది పారిశుధ్యం మెరుగుకు ఎటువంటి సూచనలు చేసిన దాఖలాలు లేవు. తిమ్మాపురం, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు, రేవుపోలవరం, పెదఉప్పలం, సర్వసిద్ధి, పేటసూధిపురం, జీవీ పాలెం, ఉప్పరాపల్లి, వాకపాడు తదితర గ్రామాల్లో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది. మురుగునీరు రోడ్లపై నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నా మెరుగైన వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీల్లో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మొక్కుబడిగా విధులు



పెనుగొల్లు పీహెచ్‌సీలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదు. వైద్య సిబ్బంది మొక్కుబడిగా ఆస్పత్రికి వచ్చి వెళుతున్నారు. సక్రమంగా వైద్యం అందకపోవడంతో చాలా మంది నక్కపల్లి సీహెచ్‌సీని ఆశ్రయించవలసి వస్తోంది. జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలేదు.

– గొంతిన సత్యనారాయణ, వమ్మవరం

సకాలంలో స్పందించడం లేదు



పెనుగొల్లు, ఎస్.రాయవరం పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది కాలయాపన చేస్తూ సకాలంలో వైద్యసేవలు అందించడం లేదు.ఎవరూ ఎప్పుడు వస్తున్నారో తెలియని పరిస్థితి.ఇక్కడ సిబ్బంది ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకోవడానికే సమయం సరిపోతోంది. అభివృద్ధి నిధులు కూడా ఎక్కడ ఖర్చు పెడుతున్నారో తెలియడం లేదు. ప్రసవాల కోసం గర్భిణులు పక్క మండలాల్లో ఆస్పత్రులకు వెళుతున్నారు.

– జి.గోవిందరావు, అడ్డురోడ్డు

నిస్వార్థంగా సేవలు



నిస్వార్థంగా పీహెచ్‌సీలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. సిబ్బంది కూడా సమయ పాలన పాటిస్తున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. జిల్లా వైద్యాధికారులు నిర్దేశించిన టార్గెట్ రీచ్ అవుతున్నాం. పీహెచ్‌సీలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరగలేదు. రికార్డులు అన్నీ సక్రమంగా ఉన్నాయి.

– పి.రాజేశ్వరి, వైద్యాధికారి, పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మెరుగైన వైద్యం అందిస్తున్నాం..



పీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందుతోంది. ఎప్పటికప్పుడు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. డెప్యుటేషన్‌పై సిబ్బంది ఒకరిద్దరు ఉన్నా వైద్యం అందించడంలో ఎటువంటి అలసత్వం లేదు. పారిశుధ్యం విషయం పంచాయతీ సిబ్బంది చూడాలి. స్థానిక ఏఎన్‌ఎంలతో ఎప్పటికప్పుడు చెప్పి సరి చేస్తున్నాం.

– ఎస్.వి.ఎస్.శక్తిప్రియ, సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి

నేడు ఏటికొప్పాకలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: విద్యుత్ లైన్లు,ఇతర మరమ్మతు,నిర్వహణ పనుల కారణంగా మండలంలోని ఏటికొప్పాక మేజర్ పంచాయతీలో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి శనివారం ఉదయం 4 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు,తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు అవకాశంమేరకు విద్యుత్ సరఫరా ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు.ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. చినగుమ్ములూరు, దార్లపూడి ఆర్‌డబ్ల్యూఎస్ స్కీమ్‌లకు, గుడివాడ 6.3 కేవీ లైన్‌కు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

మూలపేటలో మౌలిక వసతుల కల్పనకు కృషి



చేతి బోరును అందుబాటులోకి తీసుకువస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: మూలపేటలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు తెలిపారు.మూలపేట దళితవాడలో పాడైన చేతిబోరుకు శుక్రవారం మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా పాలకవర్గం కృషిచేస్తోందన్నారు. పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణపై దృష్టి సారించినట్టు చెప్పారు. కార్యదర్శి మొల్లేటి గంగాధర్,వార్డు సభ్యులు యల్లపు హైమావతి, మొల్లేటి గోవిందరావు, ఆడారి ఉదయ్,బీజేపీ మండల అధ్యక్షులు యల్లపు రాజేశ్వరరావు, బొడ్డేడ ఆదిరాజు,కనిశెట్టి వరహా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమ్మె సైరన్



తహసీల్దార్ వరహాలుకు సమ్మె నోటీసు ఇస్తున్న 108 వాహనం సిబ్బంది

యలమంచిలి రూరల్: అత్యవసర సేవలు అందించే 108 అంబులెన్స్ ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు.ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25 నుంచి సమ్మె చేయనున్నట్టు అధికారులకు నోటీసు ఇచ్చారు.స్థానిక మండల రెవెన్యూ,మండల పరిషత్ కార్యాలయాల్లో తహసీల్దార్ కె.వరహాలు,ఎంపీడీవో కొండలరావులకు వేర్వేరుగా సమ్మె నోటీసులు అందజేశారు. యలమంచిలి పరిధిలో 108 అంబులెన్స్ వాహనాల్లో పనిచేస్తున్న ఈఎంటీ,పైలట్లకు గ్రాట్యుటీ,ఆర్జిత సెలవుల సొమ్ము,వార్షిక ఇంక్రిమెంట్లు చెల్లించాలని,108 వాహనాల నిర్వహణను ప్రభుత్వమే చూడాలని,సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి నెలా 5వ తేదీన వేతనాలు చెల్లించాలన్న డిమాండ్లను సమ్మె నోటీసులో పేర్కొన్నారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి తమకు న్యాయం చేయాలని సిబ్బంది కోరారు.ఈ కార్యక్రమంలో జి.సునీల్‌కుమార్, ఎన్.నవీన్, బి.సాయిసుభాష్,సీహెచ్.నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గుమ్మడి అమ్మలు పేరంటాల జాతర



అమ్మవారి వేష ధారణలో కళాకారులు



అమ్మవారి ఘటాన్ని శిరస్సున పెట్టుకుని తీసుకొని వెళుతున్న భక్తుడు

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి మండలం కొత్తూరు గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గుమ్మడి అమ్మలు పేరంటాల జాతర శుక్రవారం ఘనంగా ముగిసింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని భారీ ఊరేగింపుతో ఆలయానికి తీసుకువచ్చారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కుటుంబసభ్యులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. అంతకుముందు అమ్మవారి ఘటాన్ని సుందరపు కుటుంబ సభ్యులు అత్యంత భక్తి శ్రద్ధలతో గ్రామంలో ఊరేగించారు. అమ్మవారిని పూలు, పసుపు కుంకుమలతో అలంకరించి, మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలో కాళీకాదేవి వేషధారణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కేరళ నుంచి వచ్చిన కళాకారులు అమ్మవారి వేషధారణతో అలరించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి



ఉపమాక శివాలయంలోపూజలు నిర్వహిస్తున్న మహిళలు



బుచ్చింపేటలో మినీ కైలాసగిరిపై శివపార్వతులకు పూజలు చేసుకున్న భక్తులు



నాగులాపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



తంతడిలో చంద్ర కిరణాల వెలుగులో పాలను మరిగిస్తున్న భక్తులు



యలమంచిలి త్రిమూర్తులుస్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



యలమంచిలి కాశీవిశ్వేశరాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

కోటవురట్ల: కార్తీక పౌర్ణమిని మండలంలో ప్రజలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. వేకువజామునే వరాహనదిలో స్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో నీలిమారామలింగేశ్వరస్వామి ఆలయం, చిన లింగాపురంలోని దుర్గా మల్లేశ్వర అయ్యప్ప ఆలయం, జల్లూరులోని ఆత్మలింగేశ్వరస్వామి ఆలయం, కైలాసపట్నంలోని రాజగోపాలస్వామి ఆలయంలలో అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు రాజగోపాలస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు.

రోలుగుంట: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. జానికీరాంపురం, కుసుర్లపూడిలలో ఏరుల వద్ద వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రోలుగుంటలోని కాశీవిశ్వేశ్వర మృత్యుంజయ ఆలయం, బుచ్చింపేట కొండపై కైలాసగిరిని తలపించే విధంగా ఉన్న శివపార్వతుల విగ్రహాల వద్ద అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు.

మునగపాక: మండల వ్యాప్తంగా శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచి ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. నాగులాపల్లి,మునగపాక లింగరాయి గుడి తదితర ప్రాంతాల్లో శివపార్వతులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అచ్యుతాపురం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సమసరసతా సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో పలు చోట్ల వెన్నెలలో పాలు మరిగించారు. వెన్నెలలో పాలు మరిగించి స్వీకరిస్తే అమృతంతో సమానమని సమసరసతా సేవ ఫౌండేషన్ యలమంచిలి సబ్ డివిజన్ కన్వీనర్ కొల్లి అప్పారావు తెలిపారు.తంతడిలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా భక్తులు సామూహిక హారతిలో చోడపల్లి సత్యం, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణం,మండలంలోని పలు గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సమీపంలో చెరువులు,కాలువలు,నదులు,బావుల్లో దీపాలు వదిలి భక్తిప్రపత్తులను చాటుకున్నారు.

నక్కపల్లి: కార్తీక పౌర్ణమిని శుక్రవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉపమాకలో లక్ష్మణేశ్వరస్వామి ఆలయం, ఒడ్డిమెట్టలో శివాలయం, గొడిచర్లలో శేషలింగేశ్వరాలయాలకు చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తవశంకరుని స్మరించి.. భక్తుల సేవలో తరించి

గిరి ప్రదక్షిణ భక్తులకు సేవలందించిన పలు గ్రామాల ప్రజలు



మడకపాలెంలో భక్తులకు తాగునీరు, బిస్కట్లు,సేమియా అందజేస్తున్న దృశ్యం



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు



ఆలయం వద్ద వైద్య పరీక్షలు చేయించుకుంటున్న భక్తులు



భక్తులకు ప్రసాద వితరణ

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లిలో ఉమాధర్మలింగేశ్వర స్వామి కొలువై ఉన్న ఫణిగిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు పలువురు సేవ చేసి తరించారు. పానియాలు, ఆహార పదార్థాలు అందించి పునీతులయ్యారు. మరో వైపు సేవ చేస్తున్నంత సేపూ శివనామస్మరణ చేస్తూ భక్తిప్రపత్తులు చాటుకున్నారు. రాంబిల్లి మండలం ధారభోగాపురంలో ఆకుల శ్రీను, వారి బంధువులు, సతీష్, శ్రీను ఆధ్వర్యంలో అన్న ప్రసాదం అందజేశారు. గోకివాడలో గ్రామ పెద్దలు భక్తులకు టీ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

మునగపాక: మండలంలోని మడకపాలెంకు చెందిన పలువురు యువకులు తమవంతు సాయంగా తాగునీరు, సేమియా, బిస్కట్లు అందజేశారు. గిరి ప్రదక్షిణ పలు గ్రామాల మీదుగా సాగిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు రాయి బుజ్జితో పాటు ఉల్లింగల సూరిబాబు, పీలా శంకర్, బాపునాయుడు,కుమార్‌రాజు, లగిశెట్టి సన్యాశినాయుడు,ముసిలినాయుడు సేవా కార్యక్రమం నిర్వహించారు.

అచ్యుతాపురం: మండలం పరిధిలోని వెదురువాడ,చోడపల్లి తదితర గ్రామాలల్లో గిరిప్రదక్షిణ భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కొన్ని ప్రాంతాల్లో మజ్జిగ,బిస్కట్లు,అరటి పళ్ల అందజేశారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



స్క్రీనింగ్ టెస్టులు చేస్తున్న సిబ్బంది

ఎస్.రాయవరం: క్యాన్సర్ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పర్చుకోవాలని, తద్వారా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడాలని పెనుగొల్లు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ ఆదినారాయణ మూర్తి తెలిపారు. కొత్తరేవుపోలవరంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారపు అలవాట్ల కారణంగా ఎక్కువ శాతం మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారని చెప్పారు. అనంతరం పలువురి నివాసాలకు వెళ్లి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు.

ఆసక్తికరంగా ప్రశ్నా వినోదం

పాయకరావుపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ అధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ప్రశ్నా వినోదం (క్విజ్) పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంతో ఆసక్తికరంగా సాగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రంథాలయాధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలను ప్రకటించినట్టు చెప్పారు. ఈ నెల 20న బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు సీతారామయ్య, అచ్యుతరావు, సీతారామమూర్తి, తేజోమూర్తుల వెంకటేశ్వరరావు, వాసుదేవరావు, యోగా గురువు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సభ్యత్వ నమోదు రోజులను అందజేశారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు,మారిసెట్టి వెంకట అప్పారావు మాస్టారు, దోని నూకరాజు,లాలం ప్రసాద్ పాల్గొన్నారు.

కోటవురట్ల: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సముపార్జించవచ్చని స్థానిక శాఖ గ్రంథాలయాధికారి అప్పలనాయుడు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఉపాధ్యాయులు జె.నరసింగరావు, జె.వి.ప్రసాదరావు, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.